## బొమ్మల కుంటలోనే వినాయక విగ్రహాల నిమజ్జనం



**దశ, చౌటుప్పల్:** చౌటుప్పల్ పురపాలక సంఘం పరిధిలోని 20 వార్డుల ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని చిన్న కొండూరులోని 'బొమ్మల కుంట' చెరువులోనే నిర్వహించాలని అధికారులు సూచించారు. నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో నిర్వహించాలని ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పెద్ద కొండూరు వద్ద నిమజ్జనం నిర్వహించకుండా, చిన్న కొండూరులో అధికారులు ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రాంతాన్ని మాత్రమే వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. నిమజ్జనం సందర్భంగా అధికారులు, మున్సిపల్ సిబ్బంది చేసే సూచనలను ప్రతి ఒక్కరూ పాటించి సహకరించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## లక్ష్మారెడ్డిపాలెంలో ఘనంగా గణపతి అన్నదానం



**దశ, పెద్ద అంబర్‌పేట:** లక్ష్మారెడ్డిపాలెంలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యక్రమానికి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. వారిని గణపతి ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఘనంగా ఆహ్వానించి సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయడంలో కీలకంగా నిలిచారు.

## ఆర్టీఐ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నాయకోటి గోపాల్

**దశ, కామారెడ్డి:** సమాచార హక్కు చట్టం2005 (ఆర్టీఐ ) పై ప్రజల్లో మరింత అవగాహన కల్పించడంతో పాటు పాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్న నాయకోటి గోపాల్ను సమాచార హక్కు చట్టం2005 సొసైటీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించారు. సమాచార హక్కు సంరక్షణ చట్టం రాష్ట్ర అధ్యక్షులు, ఫౌండర్ బెల్లంకొండ శేఖర్ ఆధ్వర్యంలో హైదరాబాద్లో నిర్వహించిన కార్యక్రమంలో నాయకోటి గోపాల్కు రాష్ట్ర ఉపాధ్యక్ష బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా బెల్లంకొండ శేఖర్ మాట్లాడుతూ, సొసైటీ ఆధ్వర్యంలో ప్రజలకు సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన సదస్సులు నిర్వహించాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టానికి సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేసేలా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు కార్యాలయ రికార్డులను భద్రంగా నిర్వహిస్తూ, ప్రజలకు అవసరమైన సమాచారాన్ని చట్టపరమైన నిబంధనల మేరకు అందించాలని, పాలనలో జవాబుదారీతనాన్ని పాటించాలని సూచించారు.

# సర్పంచులకు గౌరవం ఎక్కడ?

- *బాధ్యతలు మాత్రం కొండంత.. గౌరవ వేతనం మాత్రం అంతంతే!*
- *ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా గౌరవ వేతనం పెంచాలి; పంచాయతీలకు స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నిధులు ప్రతినెలా విడుదల చేయాలని డిమాండ్*




**దశ, వరంగల్ :** గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండే సర్పంచులకు ప్రభుత్వం అందిస్తున్న గౌరవ వేతనాన్ని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పెంచాలని తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ డిమాండ్ చేశారు. సర్పంచులపై బాధ్యతలు పెరుగుతున్నా.. అందుకు తగ్గట్టుగా గౌరవ వేతనం లేకపోవడం సరికాదన్నారు. తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ గౌరవ అధ్యక్షుడు, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడిగా దండెం సంపత్‌ను నియమించారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సుర్వి యాదయ్య గౌడ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. మాజీ సర్పంచుల సంఘం కార్యదర్శి మెడెం సాగర్ సమక్షంలో కార్యక్రమం జరిగింది. గ్రామస్థాయిలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో సర్పంచులు కీలక పాత్ర పోషిస్తున్నారని యాదయ్య గౌడ్ అన్నారు. పెరుగుతున్న ఖర్చులు, నిర్వహించాల్సిన బాధ్యతలను పరిగణనలోకి తీసుకుని గౌరవ వేతనాన్ని సవరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా గ్రామ పంచాయతీల ఆర్థిక అవసరాలకు అనుగుణంగా స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నిధులను ప్రతినెలా క్రమం తప్పకుండా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిధుల విడుదలలో స్పష్టమైన విధానం, క్రమబద్ధత ఉంటే గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

జిల్లా జేఏసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన దండెం సంపత్ మాట్లాడుతూ సర్పంచుల సమస్యలను జిల్లాస్థాయిలో సమన్వయం చేసి, రాష్ట్రస్థాయిలో వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సర్పంచుల హక్కుల పరిరక్షణ, గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం సంఘాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు. జిల్లాలోని సర్పంచులు, మాజీ సర్పంచులను సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి ముందుకు సాగుతామని చెప్పారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



## చిన్న రావిరాలలో కాంగ్రెస్ కమిటీలు ఏర్పాటు

- *గ్రామ, యువజన కాంగ్రెస్ కమిటీల నియామకం.. పార్టీ బలోపేతంపై నేతల దృష్టి*

**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం చిన్న రావిరాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ, యువజన కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటు చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బింగి దేవదాస్ గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. బి. బ్లాక్ అధ్యక్షుడు భాస్కర్ చారి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రణీత్ యాదవ్, కావడిపల్లి గ్రామ సీనియర్ నాయకుడు కోలన్ రవీందర్‌రెడ్డి అధ్యక్షతన కమిటీల ఏర్పాటు చేపట్టారు. గ్రామ సర్పంచ్ కిషన్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు లింగారెడ్డి, ధర్మారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కిష్టయ్య, వెంకటేష్, కమలమ్మ తదితరుల పర్యవేక్షణలో నూతన కమిటీలను ప్రకటించారు. చిన్న రావిరాల గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడిగా చింతల మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా బంగారి సత్యనారాయణ, సదిపల్లి శివశంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కండికోట శివశంకర్‌రెడ్డి, నాగిరెడ్డి శివరెడ్డి, కోశాధికారిగా శేఖర్‌రెడ్డి, గుర్రం సురేందర్‌నేత, ఒంటేడు అశోక్ నియమితులయ్యారు. యువజన కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా కారెడ్డి అమూల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బండారి శివ, ప్రధాన కార్యదర్శిగా ఒంటేడు శ్రీనివాస్, కోశాధికారిగా శివ, కార్యదర్శిగా సంపంగి అనిల్‌ను నియమించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడం, గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లడంపై నాయకులు చర్చించారు. నూతన కమిటీలకు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

## ఇనామ్‌గూడ సర్పంచ్, కార్యదర్శికి షోకాజ్ నోటీసులు

- *విధుల నిర్వహణలో నిర్లక్ష్యంపై అధికారుల చర్యలు.. వివరణ కోరిన జిల్లా పంచాయతీ అధికారులు*

**దశ, అబ్దుల్లాపూర్ మెట్ :** గ్రామ పంచాయతీ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, విధి విస్మరణ జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించిన అధికారులు ఇనామ్‌గూడ గ్రామ పంచాయతీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018, సంబంధిత నిబంధనల ప్రకారం తమకు అప్పగించిన చట్టబద్ధ విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వహించడంలో నిర్లక్ష్యం వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు సంబంధిత జిల్లా పంచాయతీ అధికారులు ఇద్దరికీ నోటీసులు జారీ చేసి, విధుల నిర్వహణలో చోటుచేసుకున్న అంశాలపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ పరిపాలన, ప్రజలకు అందాల్సిన సేవల విషయంలో బాధ్యతారాహిత్యాన్ని ఉపేక్షించబోమని అధికారుల చర్య స్పష్టం చేస్తోంది. నోటీసులకు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి సమర్పించే వివరణతో పాటు సంబంధిత రికార్డులను అధికారులు పరిశీలించనున్నారు. వారి వివరణ, అందుబాటులో ఉన్న పత్రాలు, రికార్డుల పరిశీలన అనంతరం పంచాయతీరాజ్ చట్టం, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.



## గణేష్ మండపాల్లో మాజీ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి పూజలు

- *ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో గణనాథుడి దర్శనం.. ప్రజలకు శుభాకాంక్షలు.*

**దశ, హయత్‌నగర్:** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను సందర్శించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. పద్మాలయ కాలనీ, సూర్యానగర్ ఫేజ్1, సూర్యానగర్ ఫేజ్ 2, సాయి కాలనీ, శివశక్తినగర్, విద్యానగర్, మైత్రీవనం అపార్ట్‌మెంట్స్, హుడా సాయి కాలనీ, ద్వారకామాయినగర్, ద్వారకామాయినగర్ కమ్యూనిటీ హాల్, రాఘవేంద్ర కాలనీ, గాయత్రినగర్ ఫేజ్1, వెంకటాద్రినగర్ తదితర ప్రాంతాల్లోని మండపాలను ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.

వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన మండపాలను సందర్శించి భక్తులతో కలిసి పూజల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబంపై గణనాథుడి కృప ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, హైకోర్టు కాలనీ అధ్యక్షుడు మధుసూదన్, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, సీనియర్ నాయకులు గోవిందాచారి, అరుణ్, బీజేవైఎం నాయకుడు ఎర్ర ప్రేమ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## శిల్పి కాలనీలో చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు



**దశ, పెద్ద అంబర్‌పేట:** శిల్పి కాలనీలో ఆదివారం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గణపతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ పోటీల్లో కాలనీకి చెందిన చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. గణనాథుడి చిత్రాలతో పాటు వివిధ అంశాలపై చిన్నారులు వేసిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ చిన్నారుల్లో సృజనాత్మకతను, కళాత్మక ప్రతిభను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న చిన్నారులను అభినందించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, యువకులు, మహిళలు, చిన్నారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అబ్దుల్లాపూర్‌మెట్‌లో మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమం

**దశ, అబ్దుల్లాపూర్‌మెట్:** మహిళలు, బాలికల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్‌లో మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వేధింపులు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోలీసులను సంప్రదించే విధానాలపై అధికారులు అవగాహన కల్పించారు.

కార్యక్రమానికి ఎల్‌బీనగర్ డీసీపీ డాక్టర్ అనురాధ, వనస్థలిపురం ఏసీపీ శ్రీ కాశిరెడ్డి, మహిళా భద్రత విభాగం అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మహిళలు తమకు ఎదురయ్యే సమస్యలను దాచిపెట్టకుండా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రత కోసం పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలను వివరించారు.



మహిళల పట్ల అసభ్య ప్రవర్తన, వేధింపులు, గృహ హింస లేదా ఇతర ఇబ్బందులు ఎదురైనప్పుడు భయపడకుండా పోలీసులను ఆశ్రయించాలని అధికారులు సూచించారు. మహిళా భద్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు, సమస్యలపై తక్షణ స్పందనకు పోలీస్ శాఖ అందుబాటులో ఉంటుందని తెలిపారు. మహిళలు చట్టపరమైన హక్కులు, భద్రతా చర్యలపై అవగాహన కలిగి ఉండటం ద్వారా అనేక సమస్యలను ముందుగానే నివారించవచ్చని అధికారులు పేర్కొన్నారు. మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు.

# వినాయక మండపాలను సందర్శించిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్‌గౌడ్





**దశ ఓయూ:** హెచ్‌ఎంటీ నగర్, నాచారం డివిజన్‌లోని పలు వినాయక మండపాలను బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్‌గౌడ్ బీజేపీ నాయకులతో కలిసి ఆదివారం సందర్శించారు. గణేష్ ఉత్సవ కమిటీల ఆహ్వానం మేరకు మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. నాచారం పెయింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణలో గోపాల్‌గౌడ్ పాల్గొని భక్తులకు స్వయంగా ప్రసాదాలు వడ్డించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులను అభినందిస్తూ, వినాయక నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్మిక విభాగం సెల్ కన్వీనర్ కర్నాటి యోగేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు గందమల్ల గోపి, మంజులవాణి, పార్వతి, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## రూ.10 లక్షలకు గణేశ్ లడ్డూ వేలం

❖ ఏగినేని వేణుగోపాల్ చౌదరి, మౌనికా రెడ్డికి లడ్డూ సొంతం.. ఘనంగా గణేశ్ లడ్డూ వేలం పాట



**దశ, తుర్కయంజాల్:** APR గోల్డెన్ లీఫ్ గేటెడ్ కమ్యూనిటీలో సెప్టెంబర్ 19న నిర్వహించిన గణేశ్ లడ్డూ వేలం పాట ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ వేలం పాటలో గణేశ్ లడ్డూను శ్రీ ఏగినేని వేణుగోపాల్ చౌదరి, మౌనికా రెడ్డి రూ.10 లక్షలకు దక్కించుకున్నారు. వేలం పాటలో ఉత్సాహంగా పాల్గొన్న కమ్యూనిటీ సభ్యులు, భక్తులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గణేశ్ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ వేలం పాటకు మంచి స్పందన లభించింది. లడ్డూను రూ.10 లక్షలకు దక్కించుకున్న ఏగినేని వేణుగోపాల్ చౌదరి, మౌనికా రెడ్డికి గణేశ్ కమిటీ సభ్యులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ APR గోల్డెన్ లీఫ్ గణేశ్ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది.

## మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా హనుమండ్ల ఆంజనేయులు ఏకగ్రీవ ఎన్నిక



**దశ, ఇబ్రహీంపట్నం:** తులేకలాన్ మాల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా హనుమండ్ల ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం అంబేద్కర్ విజ్ఞాన భవన్‌లో నిర్వహించిన సంఘం సభ్యుల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా కొరిమి అంజయ్య, బండి గణేష్, ప్రధాన కార్యదర్శిగా వలవోతు గణేష్, కార్యదర్శిగా పంబలి ప్రభు, కోశాధికారిగా పంబలి నగేష్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా మక్కపల్లి అంజయ్య, నాగటి అంజయ్య, కొరిమి కిషన్, దార నరసింహలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు హనుమండ్ల ఆంజనేయులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిలుకల యాదగిరి, మక్కపల్లి జగదీష్‌తో పాటు సంఘం సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ కుటుంబానికి బీఆర్ఎస్ నేతల ఆర్థిక భరోసా



❖ రూ.21.36 లక్షల ఆర్థిక సాయం అందజేసిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

❖ పార్టీ కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని భరోసా

**దశ, హైదరాబాద్:** జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం గొల్లకోట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు దివంగత సింహాచలం జగన్ కుటుంబానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో రూ.21.36 లక్షల ఆర్థిక సహాయం అందించారు. ఇటీవల జగన్ మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం, ధర్మపురి నియోజకవర్గ నాయకులు ముందుకు వచ్చారు. ఆదివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి బీఆర్ఎస్ నాయకులు జగన్ నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం తరపున రూ.10 లక్షలు, ధర్మపురి నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకులు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సేకరించిన రూ.11.36 లక్షలను కలిపి మొత్తం రూ.21.36 లక్షల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు చెక్కు రూపంలో అందజేశారు.

## 22-ఏ భూములపై చర్చకు బీఆర్ఎస్ సిద్ధపడాలి



❖ ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారాలు చేయొద్దు: పటేల్ రమేష్‌రెడ్డి

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** 22ఏ నిషేధిత భూముల అంశంపై శాసనసభలో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, బీఆర్ఎస్ నాయకులు కూడా చర్చకు రావాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్తోందన్నారు. నిషేధిత జాబితాలో ఉన్న భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి ఇబ్బందులు లేకుండా పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ అంశంపై శాసనసభలో చర్చ జరిగితే గత ప్రభుత్వ హయాంలో జరిగిన వ్యవహారాలు వెలుగులోకి వస్తాయనే ఉద్దేశంతోనే బీఆర్ఎస్ నాయకులు చర్చకు దూరంగా ఉంటున్నారని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శాసనసభకు హాజరై ప్రజా సమస్యలపై చర్చించాలని కోరారు. కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన భూముల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో ప్రస్తావించిన అంశాలపై విచారణ జరపాలని రమేష్‌రెడ్డి కోరారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లోని భూములపై సమగ్ర విచారణ జరిపి, ప్రభుత్వ భూములు ఉంటే గుర్తించి అర్హులైన పేదలకు అందించాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కుటుంబానికి సంబంధించిన భూములు, ఆస్తులపై కూడా సమగ్ర విచారణ జరపాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులు, ప్రజాప్రతినిధులుగా పనిచేసిన వారి ఆస్తులు పదవుల్లోకి రాకముందు ఎంత ఉన్నాయి.. పదవుల అనంతరం ఎంత పెరిగాయనే అంశంపై విచారణ జరపాలన్నారు. ప్రజాధనం దుర్వినియోగం జరిగినట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుని, పేదలకు ప్రయోజనం కలిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, సర్పంచ్ భూక్యా రాజు నాయక్, నాయకులు జ్యోతి కరుణాకర్, పిల్లల రమేష్ నాయుడు, వల్దాస్ దేవేందర్, పాలగాని కృష్ణ, తండు శ్రీనివాస్ గౌడ్, ధర్మ నాయక్, బొప్పని శ్రీకాంత్, కరుణాకర రెడ్డి, కుంచం అంజయ్య, పాలకుర్తి వెంకట్, లక్ష్మాయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఓయూ స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యం



**దశ ఓయూ:** ఓయూ క్యాంపస్లోని వీసీ లాడ్జ క్వార్టర్స్కు చెందిన సీహెచ్.లక్ష్మణ్ (45) అదృశ్యమయ్యారు. ఓయూ టెక్నాలజీ హాస్టల్లో వంట మనిషిగా పనిచేస్తున్న లక్ష్మణ్ సెప్టెంబర్ 18న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. మొబైల్ ఫోన్ ఇంట్లోనే వదిలి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఓయూ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆదిదేవుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



**దశ, మునగాల:** అన్నిదానాల్లో కెల్లాఅన్నదానం మిన్న అని మునగాల మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వంగవీటి వెంకటగురుమూర్తి అన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలలోభాగంగా ఆదివారం మండల కేంద్రంలో వాసవి భవన్ నందు ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహం నందు మండల ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయనప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ.గణపతి నవరాత్రోత్సవాలను ప్రతి ఒక్కరూ భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని అన్నారు. ఆదిదేవుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని,అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని అన్నారు, దైవ కార్యక్రమాలలో ఉత్సవాలలో అన్నదానం చేసిన వారికి అన్నదానంలో పాల్గొన్న వారికి శుభం కలుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పెద్దలు మునగాల పిఎసిఎస్ చైర్మన్ కందిబండ సత్యనారాయణ, నల్లపాటి శ్రీనివాస్,పోతు గంటిశ్రీనివాసరావు, పివిడి ప్రసాద్, అర్వపల్లి శంకర్, వాసవిక్లబ్ అధ్యక్షుడు అర్వపల్లి ప్రవీణ్, ఆర్యవైశ్య సంఘం మండల యువజన అధ్యక్షుడు కాపర్తి మణికంఠ కుమార్, ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బీరం హర్షవర్ధన్ని పరామర్శించిన నాయకులు

**దశ, కొల్లాపూర్:** సింగోటలోని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి నివాసానికి పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు వెళ్లి ఆయన తండ్రి దివంగత బీరం లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఇటీవల బీరం లక్ష్మారెడ్డి మృతి చెందిన నేపథ్యంలో అచ్చంపేట కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, మాజీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, మాజీ ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతితో పాటు పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగోటలోని బీరం హర్షవర్ధన్ రెడ్డి నివాసానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా బీరం లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీరం హర్షవర్ధన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి దుఃఖంలో తాము భాగస్వాములమని తెలిపారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, అధైర్యపడవద్దని సూచిస్తూ తమ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## ఉద్యమకారుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి

❖ ఓదార్పు యాత్రలోఉద్యమకారుల కుటుంబాల పరామర్శ

❖ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే లక్ష్యం

**దశ, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల కుటుంబాల పరిస్థితులను తెలుసుకుని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఓదార్పు యాత్ర నిర్వహిస్తున్నట్లు ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్, ప్రముఖ న్యాయవాది గుడిమళ్ల రవికుమార్ తెలిపారు. హనుమకొండ కాకతీయ కాలనీలోని ఐక్యవేదిక కార్యాలయంలోఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 17న వరంగల్‌లోని తొలి దశ ఉద్యమకారుల జెండా వేదిక నుంచి ఓదార్పు యాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతిరోజూ సుమారు 25 మంది ఉద్యమకారుల కుటుంబాలను కలిసి వారి పరిస్థితులను తెలుసుకుంటున్నామని, ఇప్పటివరకు 75 కుటుంబాలను పరామర్శించినట్లు రవికుమార్ వెల్లడించారు. ఉద్యమకారుల కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకుంటున్నామని చెప్పారు. వారి పరిస్థితులు చూస్తుంటే బాధ కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఉద్యమించిన వారిని రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా తగిన విధంగా ఆదుకోవడం లేదని రవికుమార్ అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఉద్యమకారులకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు. చివరకు ఇళ్ల నిర్మాణ పథకాల విషయంలోనూ పలువురు ఉద్యమకారులకు ప్రయోజనం దక్కలేదని పేర్కొన్నారు. ఇప్పటికీ అనేక మంది ఉద్యమకారులు పేదరికంలో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఆదివాసీ హక్కుల పరిరక్షణకు కదం తొక్కుదాం

**దశ, భద్రాచలం:** ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల రాజ్యాంగబద్ధ హక్కుల పరిరక్షణ, చట్టాల పక్కా అమలును డిమాండ్ చేస్తూ సోమవారం భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు తుడుం దెబ్బ, ఆదివాసీ సంఘాల నాయకులు ప్రకటించారు. భద్రాచలం ఆదివాసీ సమితి, ఆదివాసీ మహిళా చైతన్య శక్తి సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని అల్లూరి సీతారామరాజు కాలనీ శ్రీ సమ్మక్కసారలమ్మ దేవాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పెద్దలు తాటి రుక్మిణి, సోడే సావిత్రి, జారే భద్రమ్మ, యాప బుజ్జమ్మలు ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆదివాసీ మార్చ్, మహాధర్నా జయప్రదం కావాలని దీవించారు. ఈ కార్యక్రమ వివరాలను నాయకులు వెల్లడిస్తూ.. రాష్ట్ర తుడుం దెబ్బ అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం స్థానిక బ్రిడ్జి సెంటర్ నుంచి భారీ ఎత్తున 'ఆదివాసీ మార్చ్' ప్రారంభమై ప్రాజెక్ట్ అధికారి ఐటీడీఏ కార్యాలయం వరకు సాగుతుందని తెలిపారు. అనంతరం కార్యాలయం ఎదుట ఆదివాసీల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మహాధర్నా చేపట్టనున్నట్లు వివరించారు. గిరిజన ప్రాంతాల్లో చట్టాల ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణించాలని ఆదివాసీ నాయకులు స్పష్టం చేశారు. ఆదివాసీల మనుగడకు రక్షణ కల్పించే భూమి, అటవీ హక్కులతో పాటు ఎల్టీఆర్ 1/70 చట్టం, పేసా చట్టం, షెడ్యూల్డ్ ఏరియా హక్కులు, అటవీ హక్కుల గుర్తింపు చట్టం-2006లను క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేయాలి. ఏజెన్సీ సమగ్ర అభివృద్ధికి గుండెకాయ వంటి ఐటీడీఏలను నిర్వీర్యం చేయకుండా మరింత బలోపేతం చేయాలి. ఐటీడీఏ పరిధిలోని ఉద్యోగ ఖాళీలను స్థానిక ఐటీడీఏల ద్వారానే భర్తీ చేసి స్థానిక ఆదివాసీ నిరుద్యోగులకు ప్రాధాన్యత కల్పించాలి. ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు, అంతర్గత రహదారులు వంటి కనీస మౌలిక వసతుల కల్పనపై పాలకులు, అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలి. ఆదివాసీల హక్కులు, భవిష్యత్ తరాల మనుగడ కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ భేషజాలు వీడి ఐక్యంగా ఉద్యమించాలి అని నాయకులు పిలుపునిచ్చారు.

